క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



ఎంపీ విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు

మద్దిలపాలెం: నగరానికి వచ్చిన రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డిని శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అప్పారి గిరిబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, స్థానిక సమస్యలు తెలియజేశారు.

కార్ల్‌మార్క్స్‌కు ఘన నివాళి



కార్ల్‌మార్క్స్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: ప్రపంచ శాస్త్రవేత, తత్వవేత్త కార్ల్ మార్క్స్ జయంతిని మద్దిలపాలెం సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్ల్‌మార్క్స్ చిత్ర పటానికి పార్టీ సీనియర్ నాయకుడు జి.వి.ఎస్.చలపతి, జిల్లా కమిటీ సభ్యురాలు పి.మణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో దోపిడీ వ్యవస్థలు పోయి, శ్రామిక రాజ్యం సాధన కోసం కార్ల్ మార్క్స్ కమ్యూనిస్ట్ ప్రణాళిక గ్రంథాన్ని రచించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటరావు, చంటి, రమణ, శ్రీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై తోపుడు బళ్ల తొలగింపు



మద్దిలపాలెం ఫుట్‌పాత్‌పై ఉన్న తోపుడు బళ్లను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

మద్దిలపాలెం: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రహరీని ఆనుకుని ఆంధ్రా బ్యాంకు వైపు వెళ్లే మార్గంలోని ఫుట్‌పాత్‌పై ఉన్న తోపుడు బళ్లను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఫుట్‌పాత్‌పై తోపుడు బళ్లను పెట్టొద్దని హుకుం జారీ చేశారు. తోపుడు బళ్లను ఆకస్మికంగా తొలగించడంతో వ్యాపారులు అసహనం వ్యక్తం చేశారు.

ఘంటసాల ఆరాధనోత్సవం రేపు

మద్దిలపాలెం: ఘంటసాల ఆరాధకులు టెలిగ్రామ్ గ్రూప్ సభ్యుల సమర్పణలో ఘంటసాల ఆరాధనోత్సవాన్ని మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, సూరపనేని విజయకుమార్ హాజరుకానున్నారు. డాక్టర్ సయ్యద్ రహమతుల్లాతో ఘంటసాల గానావధానం డాక్టర్.కె.రామమూర్తి, బి.కల్యాణిల గానలహరి కార్యక్రమాలు జరగనున్నాయి. ఇదే వేదికపై ఘంటసాల నాటిక ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు తెలిపారు.

ఒట్టు.. ఇది బస్టాండ్ కాదు.!



శ్రీకాంత్‌నగర్ లేఅవుట్ రోడ్డులో బారులు తీరి ఉన్న ప్రైవేట్ బస్సులు

- శ్రీకాంత్‌నగర్ లేఅవుట్‌లో అనధికారికంగా ప్రైవేట్ బస్సుల పార్కింగ్
- ఉదయం వేళ హారన్ల మోతతో స్థానికుల అవస్థలు

ఆరిలోవ: స్థానిక శ్రీకాంత్‌నగర్ రోడ్డు ప్రైవేట్ బస్సుల పార్కింగ్‌తో బస్టాండ్‌ను తలపిస్తోంది. ప్రైవేట్ యజమానులు ఇక్కడి డబుల్ రోడ్డులో ఓ లైన్‌లో సుమారు అర కిలోమీటరు పొడవున నివాసాలకు ఎదురుగా తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. రాత్రి వేళ పార్కింగ్ చేసి, మళ్లీ ఉదయం తీసుకెళ్తున్నారు. ఆయా సమయాలలో అటుగా వెళ్లే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. నగరం నుంచి వచ్చినవారు చినగదిలి షిరిడీ సాయిబాబా ఆలయం మీదుగా ఆరిలోవ కాలనీ, శ్రీకాంత్‌నగర్, నలభై గజాల కాలనీ చేరుకోవడానికి ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళ బస్సులను ఇక్కడ నిలిపిన సమయంలో ముందు, వెనకకు తిప్పి వరుసలో పెట్టే క్రమంలో అటుగా వెళ్లే వాహనచోదకులు వాటిన తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఉదయం బస్సుల తీసే సమయంలో హారన్ల మోతతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడి నుంచో వచ్చి బస్సులను ఇక్కడ పార్కింగ్ చేసినా ఆరిలోవ పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఓ రోజు ఉదయం ఇక్కడ ఓ బస్సు బయలు దేరుతున్న సమయంలో టర్న్ చేస్తుండగా వెనక ఉన్న ఓ వృద్ధురాలిని ఢీకొంది. దీంతో ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందిన విషయాన్ని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆరిలోవ పోలీసులు స్పందించి అనధికారికంగా పార్కింగ్ చేస్తున్న బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆలోచింపజేసిన 'ప్రస్థానం'

మద్దిలపాలెం : తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో అపురూపంగా చూసుకుంటారు. వారు ప్రయోజకులైతే చెప్పలేనంతగా ఆనందపడతారు. అటువంటి తల్లిదండ్రులు వృద్ధాప్యంలో పట్టించుకోకపోతే.. వారు పడే వేదన..ఆవేదన కళ్లకు కట్టినట్టు ప్రస్థానం నాటికలో కళాకారులు కన్నీళ్లు పెట్టించారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించే నెలవారి నాటికలో భాగంగా ప్రస్థానం ప్రదర్శించారు. ఈ నాటికను వీఎండీఏ ప్రతినిధులు ఎమ్మెస్ఎస్ఎన్ రాజు, చలసాని కృష్ణ ప్రసాద్, ధవళేశ్వరరావు, జగత్‌రావులు ప్రారంభించారు. అనంతరం అమలాపురం వారి రసవాహిని ఆధ్వర్యంలో షహన్‌షా దర్శకత్వంలో ప్రస్థానం నాటికను ప్రదర్శించారు. తమ కుమారుడ్ని బాగాచదివించి అమెరికా పంపిస్తే..కన్నతల్లిదండ్రులను, కన్న ఊరిని మర్చిపోయిన వైనాన్ని కథాంశగా ప్రస్థానం రూపుదిద్దుకుంది. ఈ నాటిక ద్వారా తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలని, వృద్ధాప్యంలో కంటికి రెప్పలా కాపాడుకోవాలన్న సందేశం పలువుర్ని ఆలోజింపజేసింది.



ప్రస్థానంలో ఓ సన్నివేశం

అప్పన్న సన్నిధిలో మేయర్ దంపతులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న హరివెంకటకుమారి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని శుక్రవారం నగర మేయర్‌గొలగాని హరి వెంకట కుమారి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

శివాజీ పార్కులో ఆహ్లాదం కరువు

ఎంవీపీ కాలనీ: శివాజీ పార్కులో పిల్లలకు ఆహ్లాదం కరువవుతోంది. పార్కులో ఏర్పాటు చేసిన క్రీడా సముదాయంలో చాలా పరికరాలు పాడైపోయాయి. బెంచీలు సైతం విరిగిపోయాయి. నగరంలో అతి పెద్ద పార్కులో ఈ పార్కు ఒకటి. వేసవి కారణంగా సందర్శకులు ఈ పార్కుకు అధికంగా వస్తున్నారు. వీరిలో పిల్లలు సైతం ఎక్కువగా ఉంటున్నారు. వారికి ఆహ్లాదాన్ని పంచే క్రీడా పరికరాలు పాడైపోయాయి. పార్కు నిర్వహణకు ఏటా లక్షలు ఖర్చు చేస్తున్నా పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోందని సందర్శకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న శివాజీపార్కు పరిసరాలు

పేదలకు దుప్పట్ల పంపిణీ



ఆనందమార్గ్ ఆశ్రమంలో పేదలకు దుప్పట్లు అందిస్తున్న స్వామీజీ సామ్యానంద్

ఆరిలోవ: ఆనంద్‌మార్గ్ సంస్థ వ్యవస్థాపకుడు ప్రభాత రంజన్ సర్కార్ బాబా 102వ జయంతి శుక్రవారం డెయిరీ ఫారం దరి ఇందిరానగర్ ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ భక్తులు బాబాకు పూజలు, ధ్యానం, యోగా, భజనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం సుమారు 100 మంది పేదలకు ఆశ్రమం ఆచార్య సామ్యానంద్ అవదూత, భక్తులు దుప్పట్లు పంపిణీ చేశారు. భోజన పొట్లాలు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు వై.ఎ.ఎస్.రాజు, ఆర్.ఎ. పాత్రో, వైఎస్సార్ రాజు, వై.ఎస్.రాజు, బాబూరావు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని శారద

సీతంపేట: వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లలితానగర్ లలితా పీఠంలో కర్ణాటక గాత్ర కచేరీ నిర్వహించారు. వీరగంట లలితా చంద్రశేఖర్ శిష్యురాలు కొంపెల్ల లక్ష్మి శారద తన అద్భుత గాత్రంతో ప్రేక్షకులను అలరించారు. నీవే నన్ను, శ్రీవిఘ్నరాజం భజే, గౌరీ సుకుమారి, శ్రీకమలాంబికే, పామర జానపాలిని, మంగళదాయిని వంటి ముత్తుస్వామి దీక్షితార్, బాల సుబ్రహ్మణ్యం ఆలపించిన పలు గీతాలను పాడి భక్తులను ఆకట్టుకున్నారు. ఈమెకు సరస్వతుల పార్థివ వయోలిన్‌పై, చైతన్య తాలాడ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ గాయని శారదను సత్కరించి అభినందించారు.

యోగా కేంద్రంలో బుద్ధ పూర్ణిమ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో శుక్రవారం బుద్ధ పూర్ణిమ నిర్వహించారు. యోగా విలేజ్ ప్రాంగణంలోని బుద్ధుని విగ్రహానికి ఆచార్యులు, విద్యార్థులు పుష్పాలు సమర్పించి నమస్కరించారు. శ్రీలంకకు చెందిన విద్యార్థిని నిమాలి తస్కిల ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రం గౌరవ సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు, డాక్టర్ ఆర్.తులసీరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



బుద్ధుని విగ్రహం వద్ద ఆచార్యులు, విద్యార్థులు

భెల్ బీఎంఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో బీఎంఎస్ విశాఖ యూనిట్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. తిరుచ్చికి చెందిన భెల్ యూనిట్ల సెంట్రల్ లీడర్ అంగు స్వామి ఆధ్వర్యంలో సంస్థలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ముందుగా సమస్యలపై చర్చించారు. అనంతరం కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఐ.ముత్యాలును, సలహాదారుగా అంగు స్వామిని, అధ్యక్షుడిగా బ్రహ్మానంద పుష్టిని, ప్రధాన కార్యదర్శిగా రమేష్ కుమార్‌ను, 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం సమావేశంలో బీఎంఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.నాయుడు, విశాఖ జిల్లా సహాయ కార్యదర్శి నరేంద్ర, తమిళనాడు పీఎఫ్ స్టేట్ బోర్డు మెంబర్, తిరుచ్చి భెల్ ప్రధాన కార్యదర్శి శంకర్, ప్రతినిధి చందన్ కుమార్ పాల్గొన్నారు.

ఎండాడలో ట్రాఫిక్ కష్టాలు

కొమ్మాది: ఎండాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు తీవ్రమవుతున్నాయి. ఇక్కడ రెండు నెలల కిందట హైవేపై లారీ సిగ్నల్ పోల్‌ను ఢీకొట్టడంతో అది పడిపోయింది. నాటి నుంచి ఇప్పటి వరకు పోల్ అలాగే ఉండటంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. అధికారులు సిగ్నల్ పోల్‌ను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

ఆయన నేత్రాలు సజీవం



నేత్రదానం చేసిన అప్పన్నబాబు(ఫైల్)

పద్మనాభం: మండలంలోని శేరిఖండం గ్రామానికి చెందిన పుప్పాల అప్పన్నబాబు (83) మరణాంతరం తన నేత్రాలను దానం చేశారు. తాను మరణించిన తర్వాత నేత్రాలను దానం చేయాలని ఆయన కుటుంబ సభ్యులకు చెప్పాడు. గురువారం అప్పన్నబాబు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఐ బ్యాంకుకు సమాచారం ఇచ్చారు. విశాఖపట్నం ఎల్‌వీప్రసాద్ ఐ బ్యాంకు వారు గురవారం రాత్రి శేరిఖండం వచ్చి నేత్రాలను తీసుకువెళ్లారు. మృతుడు అప్పన్నబాబుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

బుద్ధవనం వద్ద పార్కింగ్ సమస్య

ఎంవీపీ కాలనీ: కైలాసగిరి కొండను ఆనుకొని ఉన్న బుద్ధవనానికి వెళ్లిన సందర్శకులకు పార్కింగ్ కష్టాలు ఎదురవుతున్నాయి. వేసవి కారణంగా సందర్శకులతో పాటు వాకర్స్ తాకిడి ఈ పార్కుకు ఎక్కువగా ఉంది. ఇక్కడి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు, పచ్చని ప్రకృతి మధ్య సేదతీరేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు ఉదయం , సాయంత్ర వేళల్లో వస్తున్నారు. అయితే వాహనాల పార్కింగ్‌కు తగినంత స్థలం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. పార్కు ముఖద్వారం వద్దే రోడ్డుపైన వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అక్కడ కూడా ఖాళీ లేకపోవడంతో సమీపంలోని ఇళ్ల ముందు పార్క్ చేస్తుండడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రజల అవసరాలకు అనుగుణంగా పార్కింగ్ సదుపాయం కల్పించాలని సందర్శకులు, వాకర్స్ కోరుతున్నారు.



పార్కు ఎదుట రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పర్యటన

కంచరపాలెం: బహిరంగ ప్రదేశాలు, రహదారుల వెంబడి చెత్తాచెదారం, చెట్ల కొమ్మలు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సూచించారు. 54వ వార్డు 104 ఏరియా, కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని వాకింగ్ ట్రాక్ ప్రాంతాల్లో వాకర్స్‌తోమాట్లాడారు. రాగిజావ విక్రయిస్తున్న ఓ వ్యాపారి ప్లాస్టిక్ గ్లాసులు వాడటం, రోడ్లపై అవి పడి ఉండటం చూసి మండిపడ్డారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకూడదని, డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని విక్రయదారులకు సూచించారు. అనంతరం త్రీస్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు, సచివాలయ శానిటరీ కార్యదర్శులపై కమిషనర్ ఆగ్రహించారు. ఇండస్ట్రియల్ ఏరియాలో శానిటరీ సిబ్బందిని నియమించి ప్రతి రోజు ఉదయం రోడ్లను శుభ్రం చేయించాలని పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోన్-5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ ఎస్.జనార్దన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని విక్రయదారుడికి సూచిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. రూ.500 చెల్లించిన దంపతులను లేదా ఇద్దరిని క్షీరాభిషేక సేవకు అనుమతించనున్నట్టు చెప్పారు. వివరాలకు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



డివైడర్‌ను ఢీకొని నుజ్జయిన కారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హిల్‌టాప్ గెస్ట్‌హౌస్ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో కారు నుజ్జయింది. అదృష్టవశాత్తు కారులో ఎవరికీ, ఎటువంటి గాయాలు కాలేదు. స్టీల్ ప్లాంట్ పోలీసులు అందించిన సమచారం మేరకు వివరాలివి.. శుక్రవారం ఉదయం టౌన్‌షిప్‌కు చెందిన వై. కిరణ్ సాయి చంద్ కారులో హిల్‌టాప్ సమీపంలోని పెట్రోల్ బంక్ మార్గంలో వెళ్తున్నాడు. పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చేసరికి కుక్క అడ్డు వచ్చింది. దీంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. కారు వేగానికి రోడ్డు పక్కన ఉన్న చెట్టు విరిగి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జయింది. ప్రమాదంలో కిరణ్ సాయి చంద్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ ఎస్ఐ మహాలక్ష్మి సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు



ప్రమాదంలో నుజ్జయిన కారు

విద్యార్థుల మనోవికాసానికి విస్తృత కార్యక్రమాలు

దాబాగార్డెన్స్: 'ఈ దేశానికి మీరు చాలా అవసరం. మానసిక ఒత్తిడిలో సమాజం మీ వెంటే ఉంటుంది. ఆత్మహత్యలకు పాల్పడొద్దు. బలవన్మరణాల నివారణకు తబుల రాసా విస్తృత కార్యక్రమాలు చేపట్టనుంది' అని ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ విజయభాస్కర్ బోనం తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో సామాజిక వేత్తలు, పలువురు సైకాలజిస్టులతో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాల్లో విఫలమైన విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. ఎన్‌సీబీఆర్ సర్వే ప్రకారం ప్రతి 46 నిమిషాలకు ఒక విద్యార్థి.. అంటే సుమారుగా రోజుకు 36 మంది.. ఏడాదికి 12,400 మంది చొప్పున విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అందులో 14 నుంచి 24 ఏళ్ల వయసు వారే ఉన్నారని తెలిపారన్నారు. వీటిని శాశ్వతంగా నిర్మూలించాలంటే విద్యా సంస్థలోనూ, విద్యా విధానంలోనూ, మరీ ముఖ్యంగా తల్లిదండ్రులు, విద్యార్థులు, టీచర్లు అవగాహన పొందాలన్నారు. విద్యార్థుల్లో మనోధైర్యాన్ని పెంచేలా, పిల్లల్లో ఇంటెలిజెన్స్‌తోపాటు ఎమోషనల్ ఇంటెలిజెన్స్, సోషల్ ఇంటిలిజెన్స్ కూడా అభివృద్ధి చేయడం చాలా అవసరమన్నారు. సైకాలజిస్ట్‌చే మెంటల్ హెల్త్ అవగాహన కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. అందుకు తమ సంస్థ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. భవిష్యత్‌లో వివిధ విద్యా సంస్థలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రులతను చైతన్య పరిచే కార్యక్రమాలు, నివారణ మార్గాలు విస్తృతంగా చేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త జి.ఎ.నారాయణరావు, డాక్టర్ రాజ్యలక్ష్మి, కె.నిరుపమ, శ్రీదేవి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చిలో శుక్రవారం పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం, క్రీస్తు రక్షకుని యాత్రా ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ఫాదర్ సరసా ప్రతాప్ పతాకావిష్కరణ చేశారు. జపమాల, దివ్యబలి పూజలు నిర్వహించారు. అనంతరం నవదిన ప్రార్థనలు ప్రారంభించారు. స్వస్థత ప్రార్థన కూటమి ప్రార్థనలు చేశారు. 9 రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో విజేతలకు మే 14న బహుమతి ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో రక్షణగిరి పత్రిక సంపాదకులు ఆదిరెడ్డి ఆల్బర్ట్, పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) సభ్యులు ఆమర్, ఆదిరెడ్డి చార్లీ, ఆనంద రావు, బేతా రాణిజోసెఫ్ పాల్గొన్నారు.



పతాకాన్ని ఎగురవేస్తున్న ఫాదర్ సరసా ప్రతాప్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



వస్త్రాలు తీసుకు వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రంతో పాటు అభిషేక సామగ్రిని మంగళవాయిద్యాల నడుమ తీసుకు వెళ్లారు. అభిషేకాలు నిర్వహించి శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.